అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: బేగంపేట మాతాజీనగర్‌ను ఆనుకుని ఉన్న హుస్సేన్‌సాగర్ బఫర్‌జోన్‌లో వెలిసిన పలు అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. 'వాళ్లు కడతారు..వీళ్లు కూలుస్తారు' అనే శీర్షికతో గతంలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి శనివారం సదరు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. అయితే ఎప్పటికప్పుడు అక్కడ జరుపుతున్న అక్రమ నిర్మాణాలను కూల్చడం అధికారులకు కొత్తేమీ కాదు. గతంలో పలుమార్లు అధికారులు కూల్చివేసినా ఆక్రమణదారులు మాత్రం కడుతూనే వస్తున్నారు. బాలానగర్ మండలం సర్వే నెంబర్ 194/8/1లో దాదాపు పదెకరాల ఇరవై గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. 2015లో ఓ బడా కంపెనీ నిర్మాణాలు చేపడితే అక్రమ లేఅవుట్‌గా పేర్కొంటూ జీహెచ్‌ఎంసీ అక్కడి నిర్మాణాలను కూల్చివేసింది. ఆ తర్వాత 2017, 2019, 2021లలో నిర్మాణాలు వెలిసిన ప్రతిసారీ కూల్చివేస్తూ వచ్చారు. గత మూడు నెలలుగా ఇక్కడి ప్రభుత్వ స్థలంలో భారీ సంఖ్యలో నిర్మాణాలు చేపడుతూ వస్తున్నారు. భారీ సంఖ్యలో నిర్మాణాలు జరిగే వరకు వేచి ఉన్న అధికారులు ఇప్పుడు ఉన్నట్టుండి అక్రమ నిర్మాణాల నేలమట్టం చేసే చర్యలను ప్రారంభించారు. శనివారం దాదాపు 50 వరకు నిర్మాణాలను కూల్చివేశారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి



మాట్లాడుతున్న పల్లె లక్ష్మణరావుగౌడ్

సనత్‌నగర్: గీత కార్మికుల సంక్షేమం కోసం కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాలని తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లె లక్ష్మణరావుగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యవర్గ అత్యవసర సమావేశంలో లక్ష్మణరావుగౌడ్ మాట్లాడారు. గౌడ జాతి కుల వృత్తిని కాపాడటం, గౌడ జాతి ఆత్మ గౌరవాన్ని పెంపొందించడానికి తెలంగాణ గౌడ సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. అకారణంగా కల్లు సొసైటీ దుకాణాలపై జరుగుతున్న పోలీసుల దాడులను ప్రభుత్వం వెంటనే నిలిపివేయించాలన్నారు. కల్లు సొసైటీలు ఉండకూడదనే కుట్రతోనే లిక్కర్ మాఫియా టార్గెట్ చేసి దాడులు చేయిస్తుందని ఆరోపించారు. గ్రామాల్లోని టీఎఫ్‌టీ, పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలను విడుదల చేయాలని, ప్రస్తుతం ఇస్తున్న ఆ రూ. ఐదు లక్షలను 10 లక్షలకు పెంచాలన్నారు. ఈ సమావేశంలో ప్రశాంత్‌గౌడ్, సంతోష్‌గౌడ్, అనురాధగౌడ్, దేవేందర్‌గౌడ్, ముఖేష్‌గౌడ్, ప్రతాప్‌లింగంగౌడ్ పాల్గొన్నారు.

హోలీ కంటే ముందే రంగులు మార్చిన శ్రీగణేష్



బీజేపీ నాయకులు

రసూల్‌పురా: బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన శ్రీ గణేష్ హోలీ కంటే ముందే రంగులు మార్చాడని బీజేపీ ఎనిమిదో వార్డు అధ్యక్షుడు శ్రీకాంత్ విమర్శించారు. కంటోన్మెంట్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీగణేష్ బీజేపీని వీడినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని గత ఎన్నికల్లో పార్టీలో ఉండి పార్టీని ఓడించారన్నారు. గతంలో బీజేపీ పార్టీలో చేరే ముందు హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహంపై పార్టీ మారనని ప్రమాణం చేశాడని పేర్కొన్నారు. బట్టు శంకర్, కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో తన వ్యక్తిగతం వల్లే 44 వేల ఓట్లు పోలైనట్లు శ్రీ గణేష్ వ్యాఖ్యానించడం తగదని ఈ సారి జరిగే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సత్తా నిరూపించుకోవాలని సవాల్ చేశారు. వ్యక్తిగతంగా ఆయనకు 44 వేల ఓట్లు వస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ కన్వీనర్ విజయానంద్, ప్రశాంత్ ప్రభు. విజయ్‌యాదవ్, వీరు, అజయ్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఫీజుల తగ్గింపునకు ఆందోళన



నెల్లి సత్యను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. శనివారం వీసీ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద పీహెచ్‌డీ విద్యార్థులు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ విద్యార్థి, ఏఐఎస్‌ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ.. పెంచిన ఫీజులు తగ్గించాలని గత ఆరు నెలలుగా పోరాడుతున్న పట్టించుకోని వీసీ ప్రొ.రవీందర్ ఈ నెల 30 వరకు ఫీజులు చెల్లించాలని నోటీసులు పంపించడం దారుణమన్నారు. సంపాదించే వయస్సుల్లో పీహెచ్‌డీ చదవడమే ఆర్థిక భారమని గతంలో లభించే స్కాలర్‌షిప్‌లను రద్దు చేయడంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నెల 26న అన్ని విద్యార్థి సంఘాల మద్దతుతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేశారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తా

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గంలోని వర్ధమాన, వెటరన్ క్రీడాకారులకు తగిన వసతి సౌకర్యాలు కల్పించి మరింత ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ, శ్రీనివాసనగర్, ఫ్రైడే మార్కెట్ తదితర ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిలకలగూడ నాగులూరి నర్సింహా జీహెచ్‌ఎంసీ పార్కును సందర్శించి వాకర్స్, సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ క్రీడాకారులతో ముచ్చటించారు. వర్ధమాన, వెటరన్ క్రీడాకారులు ఆయా క్రీడల్లో రాణించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు వివరించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 35 ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ క్రీడాకారులతో కాసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి, బండా కార్తీకరెడ్డి, కందాడి నాగేశ్వరరెడ్డి, ప్రభుగుప్తా, కనకట్ల హరి, నాగరాజు, మహేష్, రమేష్, శ్రీనివాస్, వినయ్, ప్రకాశ్‌గౌడ్, సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ ప్రతినిధులు రాజీవ్, బిట్ల రఘునందన్, జితేంద్ర, బాలరాజు, అనీల్, స్వామి పాల్గొన్నారు.

నీటి వనరులను సంరక్షించుకోవాలి



వాతావరణ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

సనత్‌నగర్: నీటి వనరులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని పర్యావరణవేత్త, వర్షపునీరు ప్రాజెక్ట్ ఫౌండర్ కల్పన రమేష్ పేర్కొన్నారు. వాతావరణ శాఖ 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బేగంపేటలోని వాతావరణ కేంద్రంలో ప్రపంచ వాతావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాతావరణ శాఖ పనితీరు, ఉపయోగించే పరికరాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే 'నీటి సంరక్షణ సవాళ్లు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరు లేనిదే మానవ మనుగడ లేదన్నారు. కానీ నీటి విలువ తెలియక వృథా చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ నీటి మట్టం కూడా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు విరివిగా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలన్నారు.



పచ్చదనం లేకపాయె..

ఎడారిని తలపిస్తున్న కొండారెడ్డి పార్కు

ఎడారిగా మారిపాయె

- అధ్వానంగా కొండారెడ్డి పార్కు
- చెత్త కుప్పలతో డంపింగ్ యార్డును తలపిస్తున్న వైనం
- వినియోగంలోకి తేవాలంటున్న సందర్శకులు
- విస్మరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

అడ్డగుట్ట: ఆహ్లాదం పంచాల్సిన పార్కులు అధ్వానంగా మారుతున్నాయి. పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు, వృద్ధులు కాలక్షేపానికి, వాకింగ్‌లు చేసుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉండాల్సిన పార్కు అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నిరుపయోగంగా మారుతుంది. వివిధ పనులు, విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికొచ్చి కాసేపు సేద తీరుదామని పార్కులకు వెళ్తే కళావిహీనంగా మారడంతో పాటు చెత్తా చెదారం దర్శనమిస్తున్నాయి. పార్కును అభివృద్ధి చేస్తామని చెప్పిన అధికారులు రాకపోవడం, స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో ఆ పార్కు పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా మారుతోంది అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్ కొండారెడ్డి పార్కు.



విరిగిన గేటు

పర్యవేక్షణ లేక..

తుకారాంగేట్‌లోని కొండారెడ్డి పార్కుపై సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్కు పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా తయారవుతుంది. వేసవి దృష్ట్యా స్థానికులకు ఇతర ప్రజలకు సేదతీరేలా ఉండాల్సిన పార్కు నిర్వాహణ లోపం కారణంగా పార్కులో పచ్చదనం కనుమరుగవుతుంది. పార్కులో ఉన్నటువంటి మొక్కలు పూర్తిగా ఎండిపోతున్నాయి. అదే విధంగా పార్కులో ఉండాల్సిన పచ్చగడ్డి కూడా ఎండకు ఎండిపోయి ప్లే గ్రౌండ్ తలపించేలా కేవలం మట్టి మాత్రమే కనిపిస్తుంది. ఈ పార్కుకు వస్తే ఎడారి ప్రాంతానికి వచ్చామనే భావన కలుగుతోందని సందర్శకులు వాపోతున్నారు.

పార్కు అంతా మట్టే..

వేసవి రావడంతోనే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండకు ప్రజలెవరూ బయట తిరగలేకపోతున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వచ్చే సరికి తడిసిపోతున్నామని, ఇళ్లలో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితులున్నాయని చెబుతున్నారు. ఈ విధంగా విరుచుకుపడుతున్న ఎండలతో సావాసం చేస్తూ సాయంత్రం వేళలో కొంత సేద తీరుదామనుకుంటే కాలనీలో ఉన్న పార్కు కూడా సరైన స్థితిలో లేదు. పచ్చదనం ఉండాల్సిన ప్రదేశం పూర్తిగా చదునుగా మారింది. కేవలం మట్టి తప్ప పచ్చగడ్డి ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. పార్కులోని సమస్యలను పరిష్కరించడంలో అదే విధంగా అభివృద్ధి చేయడంలో కూడా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘోరంగా విఫలమవుతున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చదనం పెంచాలి..



కొండారెడ్డి నగర్‌లోని పార్కుపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా సాయంత్రం వేళలో పార్కుకు వచ్చే వాకర్స్, పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కులో ఎండి పోయిన మొక్కలు, గడ్డితో పూర్తిగా చెత్తా చెదారం పేరుకుపోయింది. సరైన వాకింగ్ ట్రాక్ కూడా లేకపోవడంతో వాకింగ్ చేసే సమయాల్లో వాకర్స్ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తను తొలగించి పార్కులో పచ్చదనాన్ని పెంచాలి.

–ఉదయ్ యాదవ్, బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు



పేరుకుపోయిన చెత్తాచెదారం

ముగిసిన సింపోజియాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజులు జరిగిన జాతీయ సింపోజియాలు శనివారం ముగిశాయి. ఆయా విభాగాలలో ఇంజినీరింగ్ విద్యార్థులు స్వయంగా నిధులు సేకరించి సదస్సులు, వివిధ రకాల ఎగ్జిబిషన్స్ నిర్వహించారు.

టెట్ ఫీజు తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య శనివారం డిమాండ్ చేశారు. గతంలో ఒక్క పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఉండగా పెంచిన ఫీజు ఒక్క పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2000 పెంచడం దారుణమన్నారు. నిరుద్యోగంతో బాధపడుతున్న విద్యార్థులకు ఫీజుల భారం మోపడం సరి కాదని ఫీజులు తగ్గించకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఓటరు అవగాహన కార్యక్రమం

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శనివారం లాలాపేటలో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారిణి, తార్నాక డివిజన్ సీఓ శ్రీవాణి పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో మీ పేరును మరోసారి చెక్ చేసుకోవాలని నిర్భయంగా ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రజాపాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఓయూలో పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో ర్యాలీ చేపట్టి బెలూన్లను ఎగరవేసి వంద రోజుల ఉత్సవాలను జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రంథాలయ ఛైర్మన్ డాక్టర్ రియజ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నేత బాలలక్ష్మీ, మెడ శ్రీను, సుమన్‌గౌడ్, నవీన్, వినోద్, మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ప్రేరణ–24



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రొ.లింబాద్రి

రసూల్‌పురా: తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పీజీ కళాశాలలో కామర్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అంశంపై ప్రిన్సిపల్ ప్రొ. జాస్తి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ప్రేరణ–2024 కార్యక్రమం శనివారం ముగిసింది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. లింబాద్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కామర్స్ దాని అనుబంధ కోర్సులకు ప్రతియేడు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కామర్స్ విద్యార్థులకు అవకాశాల అంశంపై స్పష్టమైన అవగాహనతో విద్యార్థులు ఉన్నారని చెప్పారు. టీఎస్‌సీహెచ్‌ఈ వైస్ ఛైర్మన్ ఎస్‌కే. మహబూబ్ ప్రేరణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రేరణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.శ్రీనివాస మూర్తి, ప్రొ.చెన్నప్ప, డాక్టర్ రామేశ్వర్, డాక్టర్ దుర్గాప్రసాద్, ప్రొ. రాంబాబు, ప్రొ. రవి, డా. హరికాంత్, డా. రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

టీబీ రహిత తెలంగాణే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు

గాంధీఆస్పత్రి : క్షయవ్యాధి నియంత్రణ, నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్) డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలోని అలుమ్నీ భవనంలో శనివారం జరిగిన జాతీయ క్షయ నిర్మూలన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. జ్వరం, దగ్గు, అలసట, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, శ్వాసలో ఇబ్బందులు తదితర లక్షణాలు రెండు వారాల పాటు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. టీబీ వ్యాధికి సంబంధించిన అన్నిరకాల వైద్య పరీక్షలు, మందులను యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆస్పత్రులు, బస్తీ దవాఖానాల్లో ఉచితంగా అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన సంబంధిత వైద్యులు, ఉద్యోగులు, అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గాంధీ, ఉస్మానియా, ఆర్‌టీసీ నర్సింగ్ కాలేజీల విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

- అనంతరం టీబీ రహిత తెలంగాణ సాధన కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ సీనియర్ రీజనల్ డైరెక్టర్ అనురాధ, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, తెలంగాణ టీబీ అసోషియేషన్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎన్‌హెచ్‌ఎం తెలంగాణ జేడీ రాజేశం, గాంధీ ఫల్మనాలజీ హెచ్‌ఓడీ కృష్ణమూర్తి, టీబీ విభాగ అధికారులు వాసుప్రసాద్, జితేంద్ర, ఆదిత్య, సుమలత పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టాలి

రాంగోపాల్‌పేట్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టాలని ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) తీర్మానించింది. శనివారం సికింద్రాబాద్‌లోని అమృతవాణిలో ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు ఆధ్వర్యంలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎస్సీ హోదా అంశం కోసం తాము పోరాటం చేస్తున్నామని, ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఈ అంశం ఉన్నందును కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను కల్పించాలని కమిటీ తీర్మాణం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూజారులు, ఇమామ్‌లకు ఇస్తున్న మాదిరిగానే చర్చి పాస్టర్లకు గౌరవ వేతనం అందించాలని సూచించింది. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం నివారించి రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో దళిత క్రైస్తవులకు అవకాశాలు కల్పించాలని కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో డేవిడ్ కడారి, ఎన్ ప్రదీప్, డాక్టర్ ఎస్ అబ్రహాం, జయశ్రీ, గ్రేస్ నిర్మల, జాన్ సుందర్‌రాజ్, ప్రవీణ్‌కుమార్, రాజ్ కింగ్, ప్రభాకర్, స్టాన్లీ ఆంథోనీ, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తవేస్తే జరిమానా విధిస్తాం



రాంగోపాల్‌పేట్: వీధి వ్యాపారులు చెత్తను చెత్త ఆటోల్లోనే వేయాలని అలా కాకుండా రోడ్లపై పడేస్తే జరిమానా విధిస్తామని జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు. శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా గండిమైసమ్మ కమాన్ వద్ద పండ్ల వ్యాపారులు రోడ్లపైనే చెత్తను పడేస్తుండటాన్ని గమనించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా రోడ్లపైనే చెత్త, కుళ్లిపోయిన పండ్లు, తదితర వ్యర్థాలను పడేస్తుండటంతో రోడ్లు మొత్తం దుర్గంధంగా మారుతాయన్నారు. తమ సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నా మళ్లీ ఇష్టానుసారంగా చెత్త వేస్తున్నారని నిబంధనలు పాటించకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూసీడీలు యాదయ్య, సుధాకర్, నీరజ, ధనాగౌడ్, జవాన్ నర్సింగ్‌రావు, ఎస్‌ఎఫ్‌ఏ రేణులత పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో

లాలాపేట: బస్తీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం తార్నాక డివిజన్ లాలాపేటలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇంటింటికి వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తార్నాక డివిజన్ సీఓ శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులంతా బీఆర్‌ఎస్ వెంటే



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో ఉద్యమకారులంతా బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం కోసమే పని చేస్తామని స్పష్టం చేశారు. ఐదో వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు విలేకరులతో మాట్లాడారు. కొందరు బీఆర్‌ఎస్ నేతలు పార్టీ వీడినంత మాత్రాన పార్టీకి ఎలాంటి నష్టం లేదని, ఉద్యమకారులంతా బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్‌లోకి వలస వచ్చిన నేతల్లో కొందరు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారని, వారిలో ఉద్యమకారులు లేరని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే తాము పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కిరణ్ కుమార్, పెంట శ్రీహరి, శ్రీనివాస్ , మహమ్మద్ అక్తర్, కట్టెల మండి ధనరాజ్, చంద్రకాంత్ ,శత్రు, శేఖర్, బోయిన్పల్లి మార్కెట్ మాజీ డైరెక్టర్ మహంకాళి షర్విన్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి లల్లు ముదిరాజ్



లల్లు ముదిరాజ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షీ

లాలాపేట: తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లల్లు ముదిరాజ్ (లాలాపేట లల్లు పహిల్వాన్) బీఆర్‌ఎస్‌ను వీడారు. శనివారం గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. లల్లు ముదిరాజ్‌తో పాటు ఇద్దరు న్యాయవాదులు అఖిల్ ముదిరాజ్, నిఖిల్ ముదిరాజ్‌కు ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లల్లు ముదిరాజ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ముదిరాజ్‌లు ఉన్నారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పాటు పడతామన్నారు.

మర్యాద పూర్వక కలయిక



రాష్ట్ర ముఖ్యమంత్రిని పీసీసీ సెక్రటరీ అయూబ్‌ఖాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేస్తూ మల్కాజిగిరి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీ గెలిపించేందుకు కృషి చేయాలని సీఎం సూచించినట్లు అయూబ్‌ఖాన్ తెలిపారు.

–రసూల్‌పురా

మహనీయులకు ఘన నివాళి



చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న దృశ్యం



నివాళులర్పించిన బీఆర్‌ఎస్ నాయకులు

లాలాపేట: షహీద్ దివస్‌ను పురస్కరించుకుని భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు తార్నాక డివిజన్ ఆర్యనగర్‌లో స్వేరోస్ నాయకులు నివాళి అర్పించారు. ఫ్రీడం ఫైటర్స్ దేశం స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరోలైన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు భారతరత్న ప్రకటించాలని నగర స్వేరోస్ కార్యదర్శి కుమార్ షాను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శివ, కన్నప్ప, శ్రీనివాస్, రాజశేకర్, సంపత్,సందీప్, సన్నీ, జంబో, సోహిత్ పాల్గొన్నారు.

అమీర్‌పేటలో..

అమీర్‌పేట: సత్యం థియేటర్ చౌరస్తాలో అమీర్‌పేట మాజీ కార్పోరేటర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.నేటి యువత భగత్‌సింగ్ మార్గంలో నడవాలని సూచించారు. మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, కూతురు నర్సింహ పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్ట్స్ కాలేజీ ఎదుట పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, టీడీఎస్‌ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన ముగ్గురికి భారత రత్న ఇవ్వాలని, ట్యాంక్ బండ్‌పై విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఆయా విద్యార్థి సంఘాల నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.